సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



**వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి**

భువనగిరిలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి డిమాండ్ చేశారు. -8లో



**గంజాయి విక్రేతల అరెస్ట్**

ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. -8లో



**మనోధైర్యం కోల్పోవద్దు**

దివ్యాంగులు మనోధైర్యం కోల్పోవద్దని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 10లో

## న్యూస్‌రీల్

### కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ చిన్ననాయక్

భువనగిరి: గత ప్రభుత్వం హయాంలో పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్ష రాసి కానిస్టేబుల్ ఎంపికైన రాచకొండ కమిషనరేట్ పరిధిలో సుమారు 600 మంది అభ్యర్థులకు సోమవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యపరీక్షలు ప్రారంభించారు. సుమారు ఐదు రోజుల పాటు కొనసాగే ఈ ప్రక్రియలో భాగంగా తొలి రోజు 120 మంది మహిళ, పురుష అభ్యర్థులకు కంటి, రక్త, మూత్ర, ఈసీజీతో పాటు పలు రకాల పరీక్షలను నిర్వహించారు. పరీక్షల నిర్వహణ తీరును డీసీహెచ్‌ఎస్, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ చిన్ననాయక్ పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక వైద్యులను నియమించినట్టు తెలిపారు.

### ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీ ప్రారంభం

సాక్షి, యాదాద్రి: లోక్‌సభ ఎన్నికలకు వినియోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్‌ఎల్‌సీ) సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని గోదాములో ప్రారంభించారు. ఇందుకోసం ఎన్నికల కమిషన్ నియమించిన సాంకేతిక నిపుణులు వచ్చి ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈవీఎంలను పరిశీలించారు. ఎఫ్‌ఎల్‌సీ పర్యవేక్షణకు నోడల్ అధికారిగా నియమించిన జిల్లా రెవెన్యూ అధికారి ఏ.భాస్కర్‌రావు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎఫ్‌ఎల్‌సీ నిర్వహించారు. గోదాము ప్రాంగణంలోకి రాకపోకలను నియత్రించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో గల ఈవీఎంల గోదాము వద్ద ఎఫ్‌ఎల్‌సీ నిర్వహణ ఏర్పాట్లు, బందోబస్తు, వెబ్‌కాస్టింగ్‌ను నిర్వహించారు. ఈ ప్రక్రియ నవంబర్ 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

### రవాణా శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సుదర్శన్



సుదర్శన్

భువనగిరి రూరల్: తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ఉద్యోగుల సంఘం 2024–2027 సంవత్సరానికి గాను యాదాద్రి జోన్ అధ్యక్షుడిగా భువనగిరికి చెందిన సీనియర్ అసిస్టెంట్ కె.సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆ సంఘం జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 33 జిల్లాలు, ఎస్టిఏలతో కూడిన రవాణా శాఖలోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లతో అసోసియేషన్ ఏర్పాటు చేయాలని జనరల్ బాడీ తీర్మానం చేసింది. ఈ మేరకు ఈ ఎన్నిక నిర్వహించినట్లు ఎన్నికల అధికారి ఎల్.కిష్టయ్య తెలిపారు.

### మహిళా సంఘాల వివరాలు 'లోకోస్'లో ఎంట్రీ చేయాలి

యాదగిరిగుట్ట రూరల్: మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలు, వడ్డీల లెక్కలు, వాటి వివరాలను లోకోస్ యాప్‌లో ఎంట్రీ చేయాలని డీఆర్‌డీఏ అదనపు పీడీ జోజప్ప అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో యాదగిరిగుట్ట, రాజాపేట మండలాలకు చెందిన సమభావన సంఘాల ప్రతినిధులు (వీఓఏ)లకు సోమవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు విషయాలపై వీఓఏలకు అధికారులు అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం (ఐబీ ఏఈ) శ్రీనివాస్, డీపీఎం సునీల్‌రెడ్డి, ఏపీఎంలు సుధాకర్, నర్సింహ, బాలరాజు, మాధవి, మల్లేష్, సీసీలు పాల్గొన్నారు.

### విద్యుత్ సిబ్బందికి సహకరించాలి

భువనగిరి: గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లు ఉచితంగా పొందేందుకు విద్యుత్ వినియోగదారుల ఇంటికి విద్యుత్ మీటర్ రీడింగ్‌కు వచ్చే సిబ్బందికి సహకరించాలని ఎస్ఈ శ్రీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మీటర్ రీడర్లకు విద్యుత్ వినియోగదారులు తమ తెల్ల రేషన్‌కార్డుతో పాటు అందులో ఉన్న వారు ఒక్కరి ఆధార్‌కార్డులను చూపించాలని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల సర్వీస్ నంబర్‌ను అనుసంధానం చేసేందుకు సహకరించాలని కోరారు.

# రక్షణలేని వసతి

**బాలికల హాస్టళ్లపై కొరవడిన పర్యవేక్షణ**

- ఇన్‌చార్జ్ వార్డెన్లు, సిబ్బంది చేతుల్లో నిర్వహణ బాధ్యతలు
- భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థినుల మరణాలపై పలు అనుమానాలు
- కొనసాగుతున్న ఉన్నత స్థాయి విచారణ



భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌లో ఇటీవల ఇద్దరు బాలికలు ఉరివేసుకున్న గది

సాక్షి, యాదాద్రి: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు రక్షణ లేకుండా పోతోంది. ఈనెల 3న భువనగిరి ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడడంతో వసతి గృహాల రక్షణపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వసతి గృహాల నిర్వహణ కిందిస్థాయి సిబ్బంది చేతిలో పెట్టి హాస్టల్ వెల్ఫేర్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల తనిఖీలు లేక హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా మారిందని పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు. వసతి గృహాల్లో జరిగే సంఘటనలు బయటికి చెప్పకుండా విద్యార్థులను భయపెడుతున్నట్టు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. నాలుగైదు వసతి గృహాల బాధ్యతలను ఒక్కరికే అప్పగించడంతో ఆత్మహత్యలు, ఇతర సంఘటనలు జరుగుతున్నాయని, విద్యార్థులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారనే విమర్శలూ ఉన్నాయి. కాగా భువనగిరిలో విద్యార్థినుల ఆత్మహత్యపై ఉన్నతస్థాయి విచారణ కొనసాగుతోంది.

**తనిఖీలే లేవు..**

జిల్లాలోని వసతి గృహాలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి అధికారుల నిరంతర తనిఖీలు లేకుండా పోయాయి. ప్రతిరోజూ విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన వసతిగృహ సంక్షేమ అధికారులకు నాలుగైదు హాస్టళ్లకు ఇన్‌చార్జ్‌లుగా ఉంటూ ఎక్కడా సక్రమంగా విధులకు హాజరు కావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. వసతి గృహాల నిర్వహణను అక్కడ పనిచేసే ఫుల్ టైం, పార్ట్ టైం ఉద్యోగులు, సిబ్బందికి అప్పగించి వారిపైనే ఆధారపడుతున్నారు. దీంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**అనుమతి లేకున్నా మగవారు ప్రవేశం**

వసతి గృహాల్లో ప్రత్యేకించి బాలికలు, మహిళా వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. కానీ, జిల్లాలో ఒకటి రెండు చోట్ల మినహా ఏ వసతి గృహంలోనూ సీసీ కెమెరాలు లేవు. మహిళా వాచ్ ఉమెన్‌లు ఉండాలి. అలాగే బాలికల, యువతుల కళాశాల వసతి గృహాల్లోకి మగవారికి ఎట్టి పరిస్థితిలోనూ అనుమతిలేదు. జిల్లా స్థాయి మగ అధికారి అయినా సాయంత్రం ఆరుగంటల తర్వాత వార్డెన్ అనుమతి లేకుండా హాస్టల్‌లోకి వెళ్లడానికి వీలు లేదు. అయితే హాస్టళ్లలో మహిళా సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, కొన్నిచోట్ల ఆటో డ్రైవర్లు, కూరగాయలు, పాలు, వాటర్ క్యాన్లు తెచ్చే క్రమంలో యువకులను అనుమతిస్తున్నారు. జరగకూడని సంఘటనలు జరుగుతున్నాయనే అనుమాలు రేకెత్తుతున్నాయి.

**14 హాస్టళ్లకు శైలజే అధికారి**

జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో వార్డెన్‌ల కొరత ఉంది. అయితే దీన్ని కొందరు అధికారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఉన్నతాధికారుల అండతో అదనపు బాధ్యతలు మోస్తున్నారు. ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన భువనగిరి సాంఘికసంక్షేమ బాలికల వసతి గృహం వార్డెన్ శైలజ 14 వసతి గృహాలకు అధికారిగా వ్యవహరిస్తున్నారు. అంటే దాదాపు జిల్లాలోని సగానికి మించి వసతి గృహాలకు ఆమె అధికారిగా కొనసాగుతున్నారు. జిల్లాలోని 21 ఎస్సీ వసతి గృహాల్లో 11 మంది పూర్తి స్థాయి వార్డెన్‌లు ఉండగా వారికే ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. 18 బీసీ వసతి గృహాలకు 12 మంది వార్డెన్‌లు మాత్రమే ఉన్నారు. ఇదిలా ఉంటే విద్యార్థినులపై నియంత్రణ లేకపోవడంతో కూడా వారు రాత్రి వేళల్లో బయట ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యానీ హోటళ్ల వద్ద కన్పిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాలికల హాస్టళ్లలో జరుగుతున్న ఆత్మహత్యల నేపథ్యంలోనైనా పకడ్బందీ చర్యలు చేపట్టి తమ పిల్లల రక్షణ కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కాంగ్రెస్‌ను ప్రజలే బొంద పెడతారు



మాట్లాడుతున్న కడియం శ్రీహరి, చిత్రంలో జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

- రెండు నెలలైనా రైతుబంధు ఇవ్వలే..
- మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- గుట్టలో బీఆర్‌ఎస్ ఆలేరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం



ఆలేరు నియోజకవర్గస్థాయి సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

యాదగిరిగుట్ట: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఆ పార్టీని ప్రజలే బొందపెడతారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం నిర్వహించిన ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ బయటకు వస్తే బోన్‌లో బందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌వి ఆరు గ్యారంటీలు కాదని.. 420 హామీలని విమర్శించారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్‌పై రెండు నెలల కాలంలోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ఇప్పటికీ రైతుల ఖాతాల్లో పూర్తిస్థాయిలో రైతుబంధు పడక ఇబ్బందులు పడుతుంటే.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతు బంధు అంటే చెప్పుతో కొడతామని అనడం సిగ్గుచేటన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులంతా చిత్తశుద్ధితో పని చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపునకు కృషిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఆలేరులో ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. నీటి ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించి ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలను ఎండబెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ స్థానం బడుగు, బలహీన వర్గాలకే కేటాయించాలని కోరారు. గ్రామ స్థాయి నుంచే కాంగ్రెస్ పార్టీని నిలువరించాలంటే బీఆర్‌ఎస్ కార్యకర్తలు శక్తివంచన లేకుండా పని చేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్‌గౌడ్, పల్లెపాటి సత్యనారాయణ, తుంగ బాలు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, పానగాని వెంకటేష్‌గౌడ్, బీసు చందర్‌గౌడ్, బొట్ల యాదగిరి, ఎండీ ఖలీల్, ఆలేరు పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్‌గౌడ్, గుట్ట సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, మహిళా విభాగం పట్టణ అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్లు అన్నందాసు సుజాత, క్లెం స్వాతి, నాయకులు కసావు శ్రీనివాస్‌గౌడ్, ముక్కెర్ల సతీష్, తోటకూరి బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు

- రేపటి నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలి
- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి, యాదాద్రి: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే గ్రామ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 7వ తేదీ నుంచి 15 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు (స్పెషల్ శానిటేషన్ డ్రైవ్) నిర్వహించాలని ప్రజల అవసరాలు, గ్రామాభివృద్ధి పనులను గుర్తించాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నూతన పంచాయితీరాజ్ యాక్ట్ 2018పై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. గ్రామాల్లో అన్నిరకాల పనులు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించాలని అన్నారు. వేసవి ప్రారంభమవుతున్నందున ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలని, కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల ఆదాయ మార్గాలను పరిరక్షించాలని, రిజిస్టర్స్ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ప్రొటోకాల్ నిబంధనలు పాటించేలా చూసుకోవాలని చెప్పారు. పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారులకు అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి పంచాయితీరాజ్ చట్టం–2018పై శిక్షణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డివిజనల్, మండల అధికారులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులను నిషేధించాలి



ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

భువనగిరి టౌన్: గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులను పూర్తిగా నిషేధించాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమన సబిత, బండి జంగమ్మ డిమాండ్ చేశారు. సోమవారం భువనగిరి కలెక్టరేట్ ఎదుట జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. బెల్టు షాపులు నిషేధించాలని కోరుతున్నా జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకుండా బెల్టు షాపులు నిర్వహించే వారితో లావాదేవీలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. గంజాయి విక్రయాలు కూడా జిల్లాలో కొనసాగుతున్నాయని, నేరస్తులను పట్టుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వైఖరి వహిస్తున్నారన్నారు. యాదాద్రి ఆలయ పరిధిలో 12 వార్డుల్లో జోరుగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఈ ధర్నాలో సమాఖ్య ప్రతినిధులు మాటూరి జానమ్మ వడ్లకొండ భారతమ్మ, ఆరె పుష్ప, ఇంజ హేమలత, మద్దూరి భాగ్యమ్మ, మంచాల రాధమ్మ, మౌనిక, సరళ, లావణ్య, విజయలక్ష్మి, సుగుణమ్మ, అండాలు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు సేఫ్టీ రోప్ అందిస్తాం



గుట్టలో గీత కార్మికులకు సేఫ్టీ రోప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యాదగిరిగుట్ట: గీత కార్మికులు తాటి చెట్లపై నుంచి జారిపడుతున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వారికి సేఫ్టీ రోప్‌ను అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని టాడీ కార్పొరేషన్ ఎండీ ఉదయ్ ప్రకాష్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం గీత కార్మికులకు సేఫ్టీ రోప్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గీత కార్మికులు తాటి చెట్లను సులువులుగా ఎక్కి, కల్లు ఒడిసి మరలా క్షేమంగా కిందికి దిగడానికి సేఫ్టీ మోకు డెమోను ఇచ్చామన్నారు. అనంతరం పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కీం సెక్షన్ ఆఫీసర్ పాముకుంట్ల రవీందర్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాక్షులు బొలగాని జయరాములు, సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు నమిలే మహేందర్, యాదగిరిపల్లి, గుండ్లపల్లి సొసైటీ అధ్యక్షుడు సీస కృష్ణ, గంధమల్ల ఉపేందర్, గీత కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి తప్పకుండా హాజరు కావాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి
- కిందిస్థాయి అధికారులను పంపడంపై ఆగ్రహం

భువనగిరి టౌన్: అన్ని శాఖల అధికారులు ప్రజావాణికి తప్పకుండా హాజరు కావాలని, కిందిస్థాయి సిబ్బందిని పంపొద్దని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌ఓ పద్మజారాణితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి లీడ్ బ్యాంక్ మేనేజర్, భూగర్భ గనులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఎంప్లాయిమెంట్ అధికారిణి, డీఆర్‌డీఓతో కలిపి కేవలం నాలుగు శాఖల అధికారులు హాజరుకాగా మిగతా అన్ని శాఖల నుంచి సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు సమస్యలు విన్నవిస్తే పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు వస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు. ఇలాంటివి మరోసారి పునరావృతం కాకుండా చూడాలన్నారు. కొంతమంది జిల్లా అధికారులు కలెక్టరేట్‌కు వచ్చికూడా ప్రజావాణికి రాకుండా వారివారి చాంబర్లలోనే ఉంటున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే ప్రజావాణికి రెవెన్యూ శాఖకు చెందిన 9, మున్సిపాలిటీలు 4, మెప్మా 2, విద్యా శాఖ, పొల్యూషన్, ఉపాధి కల్పన శాఖల నుంచి ఒక్కొక్కటి చొప్పున మొత్తం 18 అర్జీలు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణికి వచ్చిన వినతుల్లో కొన్ని..**

- బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణంలో ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా ఇప్పటి వరకు ఇవ్వలేదని, వెంటనే కేటాయించాలని బాధితులు శోభారాణి, రాజేష్, పుష్ప, పద్మ, అరుణ వినతి పత్రం అందజేశారు.
- రాజాపేటలో ఈనెల 20 నుంచి జరిగే చిన్నమేడారం జాతర సందర్భంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయాలని సమ్మక్క–సారలమ్మ దేవాలయ ట్రస్టు ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు.
- హరిత మహిళా సంఘం తరపున 2013లో ఏపీజీవీ బ్యాంక్‌లో అప్పు తీసుకొని 2015 వరకు చెల్లించామని, మా గ్రూపులో ఇద్దరు మహిళలు అప్పు చెల్లించని కారణంగా పదేళ్లకు ఇప్పుడు బ్యాంక్ వాళ్లు మాపై ఒత్తిడి తెస్తున్నారని, మమ్ములను వేధింపులకు గురిచేయకుండా చూడాలని సంఘానికి చెందిన నాగమణి, నాగజ్యోతి, పద్మ ప్రజావాణిలో విన్నవించారు.

# దివ్యాంగులకు 'స్లాట్' తిప్పలు

- 15 నిమిషాల్లోపే క్లోజ్ అవుతున్న వెబ్‌సైట్
- తక్కువ సమయం కావడంతో కొందిమందికే బుకింగ్ చాన్స్
- నిరాశతో వెనుదిరుగుతున్న మిగతావారు
- ఈసారి రెండు నెలలకు సదరం క్యాంపుల షెడ్యూల్



భువనగిరిలోని మీసేవ కేంద్రంలో స్లాట్ బుకింగ్ చేయించుకుంటున్న దివ్యాంగులు

భువనగిరి: దివ్యాంగులకు సదరం క్యాంపుల స్లాట్ బుకింగ్‌కు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌తోపాటు ఇతర పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే సదరం సర్టిఫికెట్ ఉండాలి. దీనికి కోసం అర్హులతోపాటు తాత్కాలిక అర్హత కలిగిన వారు సైతం సదరం క్యాంపులకు హాజరు కావడానికి మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. కానీ స్లాట్ బుకింగ్ లభించక నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. వీరితోపాటు తాతాల్కిక దివ్యాంగులకు రెన్యూవల్ కాకపోవడంతో 1 నుంచి 3 నెలల పాటు పింఛన్ కోల్పోతున్నారు. అయితే ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన ఒకేసారి స్లాట్ బుకింగ్ కోసం సోమవారం అవకాశం కల్పించారు. కానీ చాలా మందికి బుకింగ్ లభించక నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**నిమిషాల వ్యవధిలోనే స్లాట్ బుకింగ్ పూర్తి**

సాధారణంగా దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ పొందేందుకు ప్రతినెలా సదరం క్యాంపుల నిర్వహణకు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ షెడ్యూల్ ప్రకటిస్తుంది. ఆయా నెలల్లో అంగవైకల్య రకాన్ని బట్టి రెండు నుంచి నాలుగు క్యాంపులను నిర్వహిస్తారు. దీంతో సుమారు ప్రతినెలా అన్ని రకాల అంగవైకల్యం కలిగిన వారిని పరీక్షించేందుకు 350 నుంచి 450 వరకు అవకాశం కల్పిస్తున్నారు. ఈసారి ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన సదరం క్యాంపుల షెడ్యూల్‌లను ఒకేసారి ప్రకటించారు. దీంతో ఆయా నెలల్లో ఒకే అంగవైకల్యానికి సంబంధించిన పరీక్షల కోసం 2 నుంచి 4 క్యాంపులను నిర్వహించనున్నారు. దీంతో పరీక్షల కోసం వచ్చే వారి సంఖ్య 600 నుంచి 800లకు చేరుకోనుంది. వీరికి సదరం షెడ్యూల్ ప్రకారం క్యాంపులు నిర్వహించేందుకు ఈ నెల 5న స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించారు. ఉదయం 10.30 గంటల తర్వాత స్లాట్ బుకింగ్‌కు సంబంధించి వెబ్‌సైట్ ఓపెన్ కావడం.. కేవలం 15 నిమిషాల్లోనే స్లాట్ బుకింగ్ పూర్తయ్యింది. దీంతో దూరప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం, మండల కేంద్రాలకు వచ్చిన వారికి స్లాట్ బుకింగ్ కాక నిరాశతో తిరిగి వెళ్లారు. ఇందులో ఎక్కువగా శారీరక లోపం కలిగినవారే ఉన్నారు. స్లాట్ బుకింగ్ సమయం పెంచాలని దివ్యాంగులు కోరుతున్నారు.

**23,245 మంది దివ్యాంగులు**

జిల్లాలో అన్ని కేటగిరీలకు చెందిన దివ్యాంగులు సుమారు 23,245 మంది ఉన్నారు. ఇందులో ఆర్థోపెడిక్, కంటి, వినికిడి లోపం, మానసిక రుగ్మత ఉన్న వారు సుమారు 12 వేల నుంచి 14వేల వరకు పింఛన్ పొందుతున్నారు. ప్రతినెలా కొత్త వారితో పాటు తాత్కాలికంగా సదరం సర్టిఫికెట్ పొందిన వారికి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం సంబంధిత శాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం స్లాట్ బుకింగ్ చేసుకొని సదరం క్యాంపులకు హాజరవుతుంటారు.

**రెండు నెలలుగా తిరుగుతున్నా..**



కాలు విరిగి చాలా రోజులవుతుంది. ఏ పనిచేసుకోలేకపోతున్నాను. వికలాంగుల పింఛన్‌కు దరఖాస్తు చేసుకుందామని సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుకింగ్‌కు మీ సేవ కేంద్రాలకు రెండు నెలల నుంచి తిరుగుతున్నాను. స్లాట్ బుకింగ్ కావడం లేదు. స్లాట్ బుకింగ్ సమయాన్ని పెంచాలి.

– శ్రవణ్‌కుమార్, లక్ష్మాపురం, రామన్నపేట మండలం

**ఎక్కువ మందికి అవకాశం కల్పించాలి**



ప్రతినెలా రెండు నుంచి నాలుగు క్యాంపుల వరకు పెడుతున్నారు. కాని క్యాంపులకు హాజరయ్యే అవకాశం కేవలం అంగవైకల్యం బట్టి 15 నుంచి 40 మందికి అవకాశం ఇస్తున్నారు. కానీ వీరి సంఖ్య 40 నుంచి 100 వరకు పెంచితే అందరికి అవకాశం లభిస్తుంది. ఎక్కువ మంది స్లాట్ బుకింగ్ చేసుకునేలా అవకాశమివ్వాలి.

– వెంకటేశం, వలిగొండ

## క్లుప్తంగా

### బాలికల ఉన్నత పాఠశాలలో విచారణ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కళారాణి

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని అదే పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు ఇటీవల డీఈఓ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా విద్యాధికారి కార్యాలయం అధికారిణి కళారాణి సోమవారం పాఠశాలలో విచారణ జరిపారు. నివేదికను విద్యాధికారికి ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

### లారీ ఢీకొని యువకుడు మృతి

బీబీనగర్: లారీ ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం కంచెనపల్లికి గ్రామానికి చెందిన సాదు చంద్రశేఖర్‌రెడ్డి(23) హైదరాబాద్‌లోని వాషింగ్ సెంటర్‌ను నడుపుతున్నాడు. కాగా ఆదివారం రాత్రి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా గూడూరు టోల్‌ప్లాజా సమీపంలోని రాఘవేందర్ హోటల్ వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలు కావడంలో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సోమవారం మృతుడి సోదరుడు సాదు విక్రమ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేందర్ తెలిపారు.

### వీడని హత్య కేసు మిస్టరీ

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో వ్యవసాయ కూలీ వంటల సైదులు హత్యకు గురై మూడు రోజులు కావస్తున్నా కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. ఈనెల 3న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సైదులును దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. గ్రామంలో ఓ వివాహితతో సైదులు వివాహేతర సంబంధం పెట్టుకున్న కారణంగానే ఈ హత్య జరిగిందనే కోణంలోనే పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. హత్య జరిగిన మరుసటి రోజే అనుమానిత మహిళతో పాటు ఆమెకు సంబంధించిన మరో కుటుంబ సభ్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంలో విచారణ జరుపుతున్నట్లు సమాచారం. మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు. దీంతో పాటు ఈ హత్యలో అనుమానిత కుటుంబ సభ్యులే కాకుండా ఇతరుల ప్రమేయం ఏమైనా ఉన్నదా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

# ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

- 4.5 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నిందితుల వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్‌హెగ్డే

మునగాల(కోదాడ): ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4.5కిలోల గంజాయితో పాటు రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే నిందితుల వివరాలు వెల్లడించారు. సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి చెందిన మెంతబోయిన గణేష్, చివ్వెంల మండల కేంద్రానికి చెందిన జాకటి కార్తీక్, మోతె మండలం రావిపహాడ్‌కు చెందిన వంటమాస్టారు ఎలుగు మహేష్ ముఠాగా ఏర్పడి కొంతకాలంగా గంజాయిని విక్రయిస్తున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒడిశా సరిహద్దులోని అంబాద గ్రామంలో కిలో రూ.5వేలకు గంజాయిని కొనుగోలు చేసి సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. అంబాద గ్రామం నుంచి 4.5 కిలోల గంజాయిని కొనుగోలు చేసిన ముఠా సభ్యులు సూర్యాపేటకు బైక్‌లపై బయలుదేరారు. ఆదివారం ఖమ్మం జిల్లా మామిళ్లగూడెం వద్ద పోలీసు చెక్‌పోస్టు ఉండడంతో కోదాడ మీదుగా సూర్యాపేటకు వెళ్తున్నారు. మార్గమధ్యలో మునగాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొద్దులచెరువు స్టేజీ వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా గంజాయి రవాణా విషయం వెలుగుచూసింది. నిందితులపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ వివరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

**గంజాయి రవాణాపై నిఘా పెంచాం**

జిల్లాలో గంజాయి రవాణా, వినియోగించే వారిపై నిఘా పెంచామని ఎస్పీ తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి రవాణా చేస్తున్న నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ వీరరాఘవులు, మునగాల, మోతె పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు పి.లోకేష్, వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐలు మల్సూర్, నాగేశ్వరరావు, సిబ్బంది సుధీర్‌కుమార్, రవికుమార్, వెంకటేశ్వర్లు, రాంబాబు, పుల్లారావు, బాలు, ఈశ్వర్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌కు..

- మహిళను కార్యాలయం గేటు వద్ద అడ్డుకున్న పోలీసులు
- భూ సమస్య పరిష్కారం కావడంలేదని ఆవేదన

దురాజ్‌పల్లి(సూర్యాపేట) : భూ సమస్యను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఓ మహిళ సోమవారం పురుగుల మందు డబ్బాతో సూర్యాపేట కలెక్టరేట్‌కు వచ్చింది. గేటు వద్దనే పోలీసులు సదరు మహిళను గుర్తించి పురుగుల మందు డబ్బాను తీసుకోవడంతో ప్రమాదం తప్పింది. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన సుంకిరెడ్డి సుశీలమ్మకు గ్రామంలోని 17, 19, 21 సర్వే నంబర్లలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 50 సంవత్సరాలుగా సుశీలమ్మ కుటుంబ సభ్యులే భూమిని సాగు చేసుకుంటున్నారు. 2012వ సంవత్సరంలో మూడు ఎకరాల భూమి సుశీలమ్మ పేరిట రిజిస్ట్రేషన్ కాగా నేటికీ పట్టాదారు పాస్‌పుస్తకం అందలేదు. తన తల్లి పేరిట భూమిని పట్టా చేసి పాస్ పుస్తకం అందించాలని కొన్ని నెలలుగా సుశీలమ్మ కూతురు చివ్వెంల మండలం గుంపుల గ్రామానికి చెందిన నాతాల పూలమ్మ కోరుతోంది. ఈ విషయంపై గతంలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా భూమిని పరిశీలించి పట్టా చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించినట్లు బాధితురాలు పేర్కొంది. అయినా మండల రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని, అందుకే ఆత్మహత్య చేసుకునేందుకు పురుగుల మందు తెచ్చుకున్నట్లు పూలమ్మ చెప్పింది. దీనిపై అదనపు కలెక్టర్ స్పందిస్తూ భూ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



పురుగుల మందు డబ్బా తీసుకున్న హోంగార్డు, చిత్రంలో బాధితురాలు పూలమ్మ

# ప్రజలకు రక్షణ కల్పించేందుకే కార్డెన్ సెర్చ్

నేరేడుచర్ల : అసాంఘిక శక్తుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకే కార్డెన్ సెర్చ్ (నిర్బంధ తనిఖీలు) నిర్వహిస్తున్నట్లు హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి పేర్కొన్నారు. నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో సోమవారం తెల్లవారుమున పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని పలు ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సంఘ విద్రోహశక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాడుతూ ప్రజా జీవనాన్ని ఇబ్బందులను గురి చేసే వారిని గుర్తించేందుకే తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద శక్తులు సంచరిస్తే పోలీసులు, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో ఐదుగురు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఏడుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 20 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



పెంచికల్‌దిన్నలో మాట్లాడుతున్న హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి

# కారు డ్రైవర్‌కు ఆరునెలల జైలు శిక్ష

కట్టంగూర్ : ఇద్దరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు సోమవారం నకిరేకల్ కోర్టు మేజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కట్టంగూర్ మండలంలోని పరడ గ్రామానికి చెందిన మాగి భిక్షం, కోనేటి యాద య్య, సుంకరబోయిన వెంకన్నల 2015వ సంవత్సరం మే 20వ తేదీన బైక్‌పై నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని పామనగుండ్ల సబ్‌స్టేషన్ వద్దకు రాగానే హైదరాబాదు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు డ్రైవర్ వడ్లపల్లి చిదానంద అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భిక్షం, యాదయ్య అక్కడికక్కడే మృతిచెందగా వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు భిక్షం కుమారుడు ప్రకాశ్ ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నకిరేకల్ మెజిస్ట్రేట్ సోమవారం కారు డ్రైవర్‌కు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

# లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు, జరిమానా

చివ్వెంల(సూర్యాపేట) : ఒకరి మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు కింది కోర్టు ఇచ్చిన తీర్పును అమలు పరుస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సోమవారం తీర్పు వెల్లడించారు. కోదాడ పట్టణానికి చెందిన మాలోతు ఉపేందర్ 2016 సంవత్సరం ఆగస్టులో తన మోపెడ్‌పై కటింగ్ షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కోదాడ నుంచి మిర్యాలగూడ వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో ఉపేందర్ అక్కడిక్కడే మృతిచెందాడు. దీంతో విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి నాగేశ్వర్‌రావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేసి జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన లారీడ్రైవర్ అద్దంకి చిన్నబాబును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచాడు. పలువురు సాక్షులను విచారించిన కోదాడ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధించారు. దానిని సవాల్ చేస్తూ నిందితుడు జిల్లా కోర్టులో అప్పీల్ చేసుకోగా, సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ కొవవల్లి లింగయ్య వాదలనతో ఏకిభవిస్తూ ఆ తీర్పునే అమలు చేశారు.

## యువకుడు అదృశ్యం

గుర్రంపోడు : ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. గుర్రంపోడుకు చెందిన షేక్ షరీఫ్(25) ఇటీవల తల్లిదండ్రులతో కలసి జాన్‌పహాడ్ దర్గాకు వెళ్లాడు. షరీఫ్‌కు మతిస్థిమితం లేదు. దర్గా వద్ద తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. తెలుపుకలర్, 5.3 అంగులాల ఎత్తు ఉంటాడని, కనిపిస్తే 8008785964నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోదాడ రూరల్ : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను రూరల్ పోలీసులు సోమవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. కోదాడ మండలంలోని మంగళితండా వద్ద గల పాలేరు వాగు నుంచి కోదాడకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా చిమిర్యాల క్రాస్‌రోడ్ వద్ద పట్టుకొని డ్రైవర్, ఓనర్ అయిన మార్కపూడి కమలాకర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఒకరికి తీవ్రగాయాలు

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణ కేంద్రంలోని కొలనుపాక రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. జనగాం జిల్లా లింగాలఘనపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీకాంత్ బైక్‌పై కొలనుపాక వెళ్లి పని ముగించుకొని తిరిగి ఆలేరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో తెలంగాణ డాబా సమీపంలో ఎదురుగా వస్తున్న తుపాన్ వాహనం ఢీకొనడంతో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

## 18మందిపై కేసు

భువనగిరి క్రైం: ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని భువనగిరిలో ఆదివారం నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న 18మందిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. వీరిలో బీఎస్పీ, బీఆర్‌ఎస్, బీజేపీ, ఐద్వా నాయకులు భట్టు రామచంద్రయ్య, ఏవీ కిరణ్‌కుమార్, రత్నపురం బాలరాజు, అనురాధ, అయోధ్యాయాదవ్, ఇమ్రాన్‌తో పాటు 12మంది ఉన్నారని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

# కుటుంబ సభ్యులు మందలించారని..

- ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

వలిగొండ : కుటుంబ సభ్యులు మందలించారని ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. వలిగొండ మండల పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన పసల సతీష్‌కుమార్ (24) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా సతీష్‌కుమార్ మద్యానికి బానిసగా మారాడు. ఈ విషయంలో సతీష్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సతీష్‌కుమార్ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం తండ్రి బాలస్వామి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా సతీష్‌కుమార్ చెట్టుకు వెలాడుతూ విగతజీవుడిగా కనిపించాడు. సమాచారం మేరకు గ్రామస్తులు వచ్చి మృతదేహాన్ని కిందకు దించారు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య భాగ్యరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.



సతీష్‌కుమార్ (ఫైల్)

# బైక్‌తో సహా సజీవదహనం

- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్న పోలీసులు
- మృతుడు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ వాసి

భువనగిరి క్రైం : ఓ వ్యక్తి బైక్‌తో సహా సజీవదహనమయ్యాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సూర నాగరాజు(39) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. నాగరాజు కొన్నేళ్లుగా మధుమేహంతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్నాడు. నాగారాజు సోమవారం తెల్లవారుజామున బైక్‌పై భువనగిరి మండలం అనంతారం గ్రామలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. అనంతరం బైక్‌తో పాటు వ్యక్తి తగలబడిపోతుండడాన్ని స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే నాగరాజు విగత జీవుడిగా మారాడు. బైక్ నంబర్ ఆధారంగా మృతుడు నాగరాజుగా గుర్తించారు. బైక్‌ను తగులబెట్టి ఆపై తానూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. మృతుడి బంధువు సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.



నాగరాజు (ఫైల్)

## పోగొట్టుకున్న పర్సు అప్పగింత

కోదాడరూరల్ : పోగొట్టుకున్న పర్సును బాధితుడికి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు.. ఓ రిటైర్డ్ టీచర్. కోదాడ పట్టణానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం శెట్టి వెంకటేశ్వర్లుకు రోశమ్మగారి వీధిలో ఓ పర్సు దొరికింది. ఆ పర్సును డీఎస్పీ కార్యాలయంలో అందజేసి పరిశీలించగా రూ.3,520 నగదుతో పాటు ఆధార్, పాన్ కార్డు పలు విలువైన పత్రాలు ఉన్నట్లు గుర్తించారు. పర్సులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఒడిశా నుంచి జీవానోపాధికి వచ్చిన షేక్.ఆరీఫ్‌దిగా గుర్తించారు. అతన్ని స్టేషన్‌కు పిలిపించి డీఎస్పీ ప్రకాష్ చేతుల మీదగా అందజేశారు. దీంతో నిజాయితీ చాటుకున్న వెంకటేశ్వర్లును డీఎస్పీతో పాటు పలువురు అభినందించారు.



బాధితుడికి పర్సు అందజేస్తున్న డీఎస్పీ ప్రకాష్, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు



# ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- యాదాద్రి భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి



విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి

భువనగిరి : భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్‌రెడ్డి డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఈ నెల 3వ తేదీన ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న గదిని సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. వార్డెన్ సంఘటన జరిగిన సమయంలో హాస్టల్‌లో లేకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న సమయంలో బెడ్ పక్కనే ఉన్నా సపోర్ట్ తీసుకోకపోవడం అనుమానంగా ఉందన్నారు. పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హాస్టల్‌లో జరిగిన సంఘటనలో వార్డెన్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. హాస్టల్ గదుల్లో అశ్లీల వ్యాఖ్యలు కనిపించడం, వార్డెన్ పర్యవేక్షణ చేయడం లేదని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలన్నారు. అంతకు ముందు ఎస్సీ వసతి గృహాల డివిజనల్ ఆఫీసర్ వసంతతో పాటు సిబ్బందితో సంఘటనలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట జెడ్పీటీసీ బీరు మల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

## మహాశివుడికి అభిషేకాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. కొండపైనే అనుబంధ ఆలయమైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వా అర్చన పూజలు విశేషంగా నిర్వహించారు. మహా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేక పూజలు చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకోగా పూజారులు శ్రీస్వామి వారి ఆశీస్సులు అందజేశారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగించారు. ఆలయంలో నిత్య కల్యాణ వేడుక, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు వంటి పర్వాలను వైభవంగా నిర్వహించారు.



స్పటిక లింగానికి పూజలు చేస్తున్న పూజారి

## మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం చేసి స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రక్తికట్టించారు. కళ్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ చేశారు. క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు, ఈఓ, అర్చకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మద్దతుకు మించి..



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ రాశులు



తిరుమలగిరి మార్కెట్‌లో కందుల రాశులు

- కంది, వేరుశనగ పంటలకు రికార్డు స్థాయిలో ధరలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రస్తుత సీజన్‌లో వేరుశనగ, కంది పంటలకు మద్దతుకు మించి ధరలు పలుకుతున్నాయి.తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు పదిహేను రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి వేరుశనగ కాయ వస్తుంది. ఇప్పటి వరకు 2,434 క్వింటాళ్ల కాయ మార్కెట్‌కు వచ్చింది. అయితే వేరుశనగ క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.6,377 ఉండగా గరిష్ఠంగా క్వింటాకు రూ.8,630, కనిష్ఠంగా రూ.6వేలకుపైగా ధర పలుకుతోంది.మార్కెట్‌కు వేరుశనగ కాయ భారీగా రావడంతో ప్రజలతోపాటు వ్యాపారులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో వేరుశనగ కాయకు మంచి డిమాండ్ ఏర్పడి రోజురోజుకూ ధర మరింత పెరుగుతూనే ఉంది. గతంలో కంటే వేరుశనగ కాయ సాగు తగ్గినా మద్దతు ధర కంటే అధిక ధరలు పలుకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కందులకు రికార్డు ధర**

కంది సాగు చేసే రైతులకు కూడా ఈసారి మంచి ధరలే వస్తున్నాయి. గత నెల రోజులుగా వ్యవసాయ మార్కెట్‌కు భారీగా కందులు వస్తున్నాయి. ప్రస్తుతం కందులకు మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.7 వేలు తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ప్రతిరోజు మద్దతు ధర కంటే అధికంగానే ధరలు వస్తున్నాయి. శుక్రవారం క్వింటాళ్‌కు గరిష్ఠంగా రూ.10217 ధర పలికింది. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ స్థాయిలో ధర రాలేదని రైతులు, వ్యాపారులు తెలుపుతున్నారు. వ్యవసాయ మార్కెట్‌కు ఇప్పటి వరకు 4971 క్వింటాళ్ల కందులు వచ్చాయి. గరిష్ఠంగా క్వింటాళ్‌కు రూ.10217, కనిష్ఠంగా రూ.8160 ధరలు పలికాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కంది పప్పు కేజీ రూ.150 కంటే అధికంగా ఉండటంతో ఈసారి కందులకు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు ధరలు చోటు చేసుకుంటున్నాయి.కందులకు ప్రభుత్వ మద్దతు ధర కంటే అధిక ధరలు వస్తుండటంతో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదు.

**ఇబ్బందులు పడుతున్నాం**

గతంలో వేరుశనగ పంటను ఎక్కువ విస్తీర్ణంలో వేసేవాళ్లం. కొన్నేళ్లుగా కోతుల బెడద అధికంగా ఉండటంతో వేరుశనగ పంట వేయలేక పోతున్నాము. ఈసారి రెండు ఎకరాలలో వేరుశనగ పంట వేశాను. ఉదయం నుంచి రాత్రి వరకు కుటుంబ సభ్యులమందరమూ కాపలా ఉన్నాము. మార్కెట్‌కు వేరుశనగ తీసుకొస్తే క్వింటాళ్‌కు రూ.7900 ధర వచ్చింది.

– వెంకటయ్య, వెలిశాల, తిరుమలగిరి మండలం

**మంచి ధర పలికింది**



తిరుమలగిరి మార్కెట్‌కు 10 క్వింటాళ్ల కందులు తీసుకొచ్చా. క్వింటాళ్‌కు రూ.10217 ధర వచ్చింది. గతంలో ఎన్నడు కూడ కందులకు ఈ ధర రాలేదు. చాలా సంతోషంగా ఉంది.

– గుగులోతు భద్రు, వెంపటి, తుంగతుర్తి మండలం

**రూ.80 కిలో చొప్పున కొనుగోలు చేశారు**



మార్కెట్‌లో వేరుశనగ కాయను కేజీకి రూ.80 చొప్పున కొనుగోలు చేశారు. ఇంటి అవసరాలకు ప్రతి సంవత్సరం మార్కెట్‌లోనే 30కేజీల వేరుశనగను కొనుగోలు చేస్తారు. మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ కాయ నాణ్యతగా ఉంటుంది.

– సాయికుమార్, తిరుమలగిరి